
సాక్షి నంద్యాల



లారీ.. దారి తప్పుతోంది!
కొందరు పోలీసులు దారితప్పుతున్నారు. సంపాదన కోసం తమ పరిధిలను అతిక్రమిస్తున్నారు. ఇటీవలే ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు సస్పెన్షన్‌కు గురయ్యారు. 8లో▸



శనగ విత్తనాల పంపిణీ ఇంకెప్పుడు!
రబీ సీజన్ మరో మూడు రోజుల్లో మొదలు అవుతోంది. జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే ఇంతవరకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేయలేదు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10,314
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10,212

సోమవారం ı 29 ı సెప్టెంబర్ ı 2025

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా వినతుల స్వీకరణ

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో ఈనెల 29న సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో, టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

కూలిన మట్టిమిద్దె



జూపాడుబంగ్లా: ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పారుమంచాల గ్రామంలో ఓ మట్టి మిద్దె ఆదివారం సాయంత్రం కూలింది. గ్రామానికి చెందిన యోహాన్‌రాజు తనకున్న మట్టిమిద్దెలో నివాసిస్తున్నాడు. అధికవర్షాలతో మట్టిమిద్దె తడిసిపోయి సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లోని వారు బయటకు వెళ్లిన సమయంలో కూలిపోయింది. దీంతో యోహాన్‌రాజు, అతని భార్య, కుటుంబసభ్యులు ప్రాణాపాయం నుంచి తప్పించుకన్నారు. మిద్దె కూలడంతో ఇంట్లోని సామాను ధ్వంసం కాగా, రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

పీహెచ్‌సీ డాక్టర్ల శాశ్వత సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎంపికైన జిల్లా పీహెచ్‌సీ డాక్టర్ల శాశ్వత సంఘం సభ్యులు

గోస్పాడు: జిల్లా ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ల శాశ్వత సంఘం ఏర్పాటుకు ఎన్నికలు పూర్తయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ లలిత తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఎన్నికల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. గతంలో అడహక్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ల సంఘం ఉండేది. అయితే ప్రస్తుతం పీహెచ్‌సీ డాక్టర్ల శాశ్వత సంఘం ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించి ఫలితాలు వెల్లడించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ అంకిరెడ్డి, జనరల్ సెక్రటరీగా డాక్టర్ చెన్నకేశవులు, వైస్ ప్రెసిడెంట్లుగా ప్రసన్నలక్ష్మి, కాంతరావునాయక్, ప్రణీత్, ట్రెజరర్‌గా డాక్టర్ హుసేని, గౌరవ సలహాదారులుగా డాక్టర్లు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, భగవాన్‌దాస్, నాగలక్ష్మి, బాబు, రంగారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్లు నిర్మల్ శ్రీజ, అమర్నాథరెడ్డి, సుహేల్‌బాబు, అనిల్‌కుమార్, రుహుల్లాఖాన్, యశ్వంత్‌కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా డాక్టర్ సయ్యద్ షబ్బీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ బాయికాటి భరత్‌కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డాక్టర్లు రూపేంద్రనాథరెడ్డి, పవన్‌కుమార్, భావనారెడ్డి, జుబేదాబేగం, అశోక్, అహమ్మద్ ఫిరోజ్, గోవర్ధన్‌రెడ్డి, వినోద్, షాహలాం, రాం భూపాల్ ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి రాకపోకలు

ఆత్మకూరు: వాయుగుండం ప్రభావంతో ఆత్మకూరు డివిజన్‌తో పాటు నల్లమలలో భారీ వర్షాలు కురవడంతో సిద్దాపురం చెరువు వద్ద అలుగు ఎక్కి పారడంతో రెండు రోజులపాటు శ్రీశైలం, విజయవాడ వైపు వెళ్లే అన్ని బస్సు సర్వీసులను అధికారులు నిలిపివేశారు. దీంతో భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం నీటి ప్రవాహం తగ్గడంతో ఆర్టీసీ అధికారులు, పోలీసులు చర్చించి వాహనాలను యథావిధిగా వెళ్లేందుకు అనుమతించారు.

పీజీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టులో జరిగిన పీజీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 462 మంది హాజరు కాగా 413 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.



16న కర్నూలుకు ప్రధాని మోదీ

● రోడ్‌షో నిర్వహించే అవకాశం ● పలు ప్రాంతాలను పరిశీలించిన జిల్లా అధికారులు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ 16వ తేదీన కర్నూలులో రోడ్‌షో నిర్వహించే అవకాశాలు ఉండడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్.. ఆదివారం కర్నూలు నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. కర్నూలులో రోడ్డు షో ఉంటుందన్న నేపథ్యంలో కొండారెడ్డి బురుజు నుంచి ఏపీఎస్‌పీ బెటాలియన్ వరకు ఉన్న ప్రాంతాలు, సమీపంలో ఉన్న ఆట స్థలాలను పరిశీలించారు. అనంతరం కర్నూలు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష నిర్వహించుకున్నారు. పీఎంఓ అధికారులు ఎలాంటి సమాచారాన్ని అడిగినా ఇచ్చేందుకు సమీక్ష ఏర్పాటు చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

శ్రీశైలానికి వెళ్లనున్న ప్రధాని

కర్నూలు నగరంలో అక్టోబర్ 16వ తేదీన రోడ్‌షో అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీశైలం వెళ్లి శ్రీమల్లికార్జున స్వామి వారిని దర్శించుకుంటారని సమాచారం వచ్చింది. కొన్ని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని సమాచారం. అయితే ఇప్పటి వరకు ప్రధానమంత్రి పర్యటన అధికారికంగా ఖరారు కాలేదు.

ఉద్యోగుల తిరుగుబావుటా!

- ప్రభుత్వం తీరుకు నిరసనగా ఆందోళనలు చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు
- ఇప్పటికే నల్ల బ్యాడ్జీలతో విధుల నిర్వహణ, కలెక్టర్‌కు వినతి పత్రాలు
- సమస్యల పరిష్కారానికి ముందుకు రాని ప్రభుత్వం
- తాజాగా అఫీషియల్ గ్రూప్ నుంచి ఎగ్జిట్ అయ్యేందుకు నిర్ణయం
- పింఛన్ల పంపిణీని కార్యాలయాలకు పరిమితం చేయాలనే ఆలోచన



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రశాంతంగా సాగుతున్న గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ అల్లకల్లోలానికి గురవుతోంది. మోయలేని పనిభారాన్ని తమపై ప్రభుత్వం మోపుతున్నదని సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన తమను ఇళ్లిళ్లు తిప్పుతూ వివిధ రకాల సర్వేల పేరుతో తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులైన ప్రజలకు గౌరవంగా అందించిన తమను కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తూ తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తోందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిభారాన్ని తగ్గించి తమకు ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇవ్వడంతో పాటు ఉద్యోగ రీత్యా తమకు దక్కాల్సిన పదోన్నతులు ఇతరత్రా బెనిఫిట్స్‌ను అందించాలని కోరుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో సచివాలయ ఉద్యోగులు తిరుగుబావుటా ఎగుర వేశారు.

సర్వేలతో సతమతం

వలంటీర్లు చేసిన పనులన్నింటినీ ఇంటింటికి తిరిగి తమను చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఉద్యోగులు అంటున్నారు. ముఖ్యంగా సర్వేలతో పేరుతో అనేక రూపాల్లో ఇబ్బంది పెడుతున్నారని వారు వాపోతున్నారు. కౌశలం, వాట్సాప్ మిత్ర, తాజాగా జీఎస్టీ సర్వే, పీ4 సర్వే, నీడ్ అసెస్‌మెంట్ తదితర అనేక సర్వేలను తమతో చేయిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వేలతో సచివాలయాల్లో ఏ ఉద్యోగి ఉండకుండా సర్వేల కోసం వీధులు, ఇళ్లు పట్టుకొని తిరగుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమబాటకు శ్రీకారం

సమస్యల సాధన కోసం గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే ఉద్యమ బాట పట్టారు. మొదటి దశగా జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలను అందించారు. అలాగే నల్లబాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తాజాగా ఈ నెల 27వ తేదిన ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 28వ తేదీ సాయంత్రం నుంచి జిల్లా అధికారులు, తమ శాఖలకు చెందిన హెడ్స్ ఉన్న అఫీషియల్ గ్రూప్ నుంచి ఎగ్జిట్ అవుతున్నారు. ప్రస్తుతం పెన్షన్ల పంపిణీని తాము విధులు నిర్వహిస్తున్న గ్రామ/ వార్డు సచివాలయాలకే పరిమితం చేయాలనే ఆలోచన చేస్తున్నారు. కేవలం బెడ్‌రీడర్స్‌కు మాత్రమే ఇళ్ల వద్దకు వెళ్లి అందించాలని, మిగిలిన వారందరికి తమ కార్యాలయాల్లోనే ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. అయితే తమ సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్యాచరణను రూపొందించేందుకు జిల్లా జేఏసీ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు...

- ➤ ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలి.
- ➤ ప్రొబేషన్ డిక్లరేషన్‌లో బకాయి పడిన తొమ్మిది నెలల వేతనాలను చెల్లించాలి.
- ➤ రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ➤ ఆరు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఏఏఎస్ ఇంప్లిమెంట్ చేయాలి.
- ➤ వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను వారి మాతృ శాఖల్లోకి పంపాలి.
- ➤ ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌గా మార్చు చేయాలి.
- ➤ ఉద్యోగుల సీనిరియాటిని రూపొందించి అర్హతల మేరకు పదోన్నతులు కల్పించాలి.

ఉమ్మడి జిల్లాలో సచివాలయ ఉద్యోగుల వివరాలు...

జిల్లా	సచివాలయాలు	మంజూరైన పోస్టులు	విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు	ఖాళీలు
కర్నూలు	672	5,738	4,256	1,482
నంద్యాల	516	4,297	3,810	487
మొత్తం:	1,188	10,035	8,066	1,969

వైఎస్సార్‌సీపీ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సేవకు పెద్ద పీట వేసింది. అందులో భాగంగా గ్రామ/ వార్డు సచివాలయాల్లో 35 శాఖలకు సంబంధించి దాదాపు 500 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రధానంగా పింఛన్, రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు, సివిల్ పనులు, వైద్యం, ఆరోగ్యం, రెవెన్యూ సమస్యలు, భూముల సర్వే, శిశు సంక్షేమం, డెయిరీ, పౌల్ట్రీ తదితర అనేక అంశాలకు సంబంధించిన సేవలను ఆయా గ్రామాల్లోనే ప్రజలు వినియోగించుకునే వెసులుబాటును కల్పించింది. అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యలను పరిష్కరించాలనే స్పష్టమైన ఆదేశాల మేరకు అప్పట్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో ప్రజలకు వారధిగా పనిచేశారు.



అర్హులకు పదోన్నతి కల్పించాలి



గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులను ప్రభుత్వం మాతృశాఖలకు అప్పగించి అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలి. విభాగాల వారిగా సీనియారిటీ ఉద్యోగుల జాబితాను విడుదల చేసి పదోన్నతి కల్పించటంతో పాటు విధి విధానాలననుసరించి పారదర్శకంగా బదిలీలు జరిగేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి. వాటితో పాటు ఉద్యోగులకు రావాల్సిన అరియర్స్, నోషనల్ ఇంక్రిమెంట్లు తక్షణమే మంజూరు చేయాలి.

– గురుస్వామి, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రికార్డ్ అసిస్టెంట్ క్యాడర్ మార్చాలి



గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం రికార్డ్ అసిస్టెంట్ క్యాడర్‌గా అమలవుతున్న విధానాన్ని జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలి. అలాగే ఆరేళ్ల పాటు ఒకే క్యాడర్‌లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 1.25 లక్షల మంది ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమాలను ప్రతి ఇంటికి చేర్చటంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇంటింటికి తిరిగి సర్వేలు నిర్వహించటంలో ఎన్నో ఇబ్బందులు, అవమానాలు ఎదురవుతున్నాయి.

– మధుసూదన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, నంద్యాల

నిరసనలు ఉధృతం చేస్తాం



ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం విముక్తి కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు ఉధృతం చేస్తాం. సచివాలయ ఉద్యోగులను మాతృశాఖకు అప్పగించటంతో పాటు విభాగాల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేసి అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలి. ఉద్యోగులందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి.

– సంపత్‌కుమార్, సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, నంద్యాల

శుభంకరీ..కాళరాత్రి



స్వామి అమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

● శ్రీగిరి క్షేత్రంలో నేత్రానందపర్వంగా సాగుతున్న దసరా ఉత్సవాలు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా నవరాత్రోత్సవాలు నేత్రానందభరితంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడవరోజు ఆదివారం భ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని కాళరాత్రి స్వరూపంలో అలంకరించారు. అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో కాళరాత్రి అమ్మవారిని ఉంచి అర్చకులు, వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను గజ వాహనంపై అలంకరించారు. గజ వాహనదీశులైన పార్వతీ పరమేశ్వరులను అలంకార మండపంలో ఉంచి అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజా హారతులనిచ్చారు. కాళరాత్రి అమ్మవారిని, గజ వాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గంగాధర మండపం నుంచి నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు నిర్వహించిన గ్రామోత్సవం కమనీయంగా సాగింది. గ్రామోత్సవంలో కోలాటం, డోలు విన్యాసాలు, కేరళ చండీమేళం, డప్పు వాయిద్యాల నడుమ కళాకారుల నృత్యప్రదర్శనలు గ్రామోత్సవానికి మరింత వన్నె తెచ్చాయి. ఈ పూజా కార్యక్రమం నేత్రానందభరితంగా సాగింది. ప్రత్యేక అలంకృతులైన స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు సోమవారం భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు నందివాహన సేవపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబరు 1వ తేదీ శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారని దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.



ఉత్సవంలో భక్తుల కోలాటం



కళాకారుల ప్రదర్శన

అరాచకాలకు మూల్యం చెల్లించాల్సిందే

● అధికారపార్టీ నాయకులకు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే హెచ్చరిక
● కార్యకర్తలకు అండగా నిలబడేందుకే 'డిజిటల్ బుక్'



'డిజిటల్ బుక్' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల, పార్టీ నాయకులు

ఆళ్లగడ్డ: 'అధికారం ఉంది కదా అని అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలు అరాచకాలకు పాల్పడుతున్నారు. దీనికి అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ప్రతి ఒక్కరు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకునేందుకు సిద్ధంగా ఉండాల'ని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హెచ్చరించారు. ఆళ్లగడ్డలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ప్రతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు పార్టీ తరపున డిజిటల్ బుక్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ఏలుబడిలో అన్యాయానికి గురైన కార్యకర్తలు ధైర్యంగా క్యూఆర్ కోడ్ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇందుకోసమే జగన్ ఈ కొత్త వ్యవస్థ తీసుకువచ్చారన్నారు. దీన్ని అన్ని మండలాలు, గ్రామాల్లో రిలీజ్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. ఇప్పటికే పార్టీ సానుభూతి పరులు, కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, వాటిపై న్యాయస్థానాల్లో పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు తగిన న్యాయం చేస్తామన్నారు. డిజిటల్ బుక్‌ను టీడీపీ నేతల రెడ్‌బుక్ మాదిరి పెట్టుకున్నామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. పార్టీ సానుభూతి పరులతో పాటు సామన్యుల సైతం ఎవరికి ఎక్కడ ఏ అన్యాయం జరిగినా సులువుగా సమాచారం తెలుసుకునేందుకు ఈ డిజిటల్ బుక్ పెట్టామని స్పష్టం చేశారు. మూడున్నరేళ్లలో వచ్చేది కచ్చితంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. ఇప్పటికే కూటమి సర్కారుపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈవిషయం తెలిసి అసెంబ్లీలో కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు కంగారు పడుతున్నారన్నారు. కూటమి సర్కారు దగా పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపైనా పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సురేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.


శ్రీమఠానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి భక్తులు పోటెత్తారు. దసరా సెలవులు కావడంతో ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కర్ణాటక, తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి సేవలో తరించారు. తుంగభద్ర నదీతీరం, మధ్వ కారిడార్, శ్రీమఠం ప్రాంగణంలో భక్తుల కోలాహలం కనిపించింది. రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తుల రాకతో భోజనశాల, పరిమళ ప్రసాదం కౌంటర్లు రద్దీగా మారాయి. భక్తుల కోలాహలంతో శ్రీమఠం సందడిగా దర్శనమిచ్చింది.



శ్రీమఠం మధ్వ కారిడార్‌లో భక్తుల కోలాహలం

16 నెలల్లో ఒక్క హామీ అమలు కాలేదు



ధర్నా విజయవంతం చేయాలని కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు హృదయరాజు అన్నారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో హృదయరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై కూటమి ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా అక్టోబర్ 7న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి, సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ వంటి హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదని అన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ అమలుకు ఆర్థిక శాఖలో నాలుగు సంవత్సరాలుగా మూలుగుతుందన్నారు. 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న కనీస వేతన స్కేల్ అమలు చేయడం లేదని అన్నారు. సమావేశంలో ఫ్యాప్టో చైర్మన్ శివయ్య, జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు పీవీ ప్రసాద్, మౌలాలి, నగరి శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, సుబ్రమణ్యం, కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేంద్రనాథ్, శివరాంప్రసాద్, సాంబశివుడు, అజాంబేగ్, లింగమయ్య, నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంప్రదాయబద్ధంగా కుమారీ పూజ


శ్రీశైలంలో కుమారీపూజలో భాగంగా చిన్నారికి పండ్లు అందిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: కుమారిపూజ నవరాత్రి ఉత్సవాలలో ఒక ముఖ్యమైన సంప్రదాయం. శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు కుమారీపూజలు నిర్వహిస్తున్నారు. ఈ కుమారీపూజలో రెండు సంవత్సరాల నుంచి పది సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజించడం జరుగుతుంది. ఈ పూజా కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత

ప్యాపిలి: జలదుర్గం పరిసర పొలంలో ఆదివారం కనిపించిన పది అడుగుల కొండచిలువను అటవీ అధికారులకు పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలేశారు. కొండ చిలువను స్థానిక రైతులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న జోన్ ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ ప్రవీణ్ అక్కడికి చేరుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ వైల్డ్ లైఫ్ హెడ్ మోహమ్మద్ ఇద్రిస్ కొండచిలువను పట్టుకుని సురక్షితంగా అడవిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. పాములు పర్యావరణానికి మేలు చేస్తాయన్నారు. పాములను చంపితే వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 ప్రకారం శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో రాచర్ల సెక్షన్ ఆఫీసర్ మౌలాలి, బీట్ ఆఫీసర్లు మహేశ్వరి బాయి, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

తాగుడుకు బానిసై...

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తాగుడుకు బానిసై ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగార్జునరెడి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అనకల సుధర్శన్ (20) గత కొన్ని రోజుల నుంచి ఇంట్లో ఉన్న వస్తువులతో పాటు భార్య బంగారు అమ్మి మద్యం తాగుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం అధికంగా మద్యం తాగి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి చూడగా అప్పటికే మరణించాడు. ఈమేరకు మృతుడి తండ్రి బాలశంకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. మృతి చెందిన సుదర్శన్‌కు భార్య, కుమారుడు సంతానం.

కాళరాత్రి దుర్గగా కామేశ్వరి దేవి



మహానంది: శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారు కాళరాత్రి దుర్గ అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ కామేశ్వరీదేవి శ్రీ కాళరాత్రి దుర్గగా దర్శనం ఇచ్చారు. శ్రీ కాళరాత్రి రూపంలో అమ్మవారిని ఉపాసించడం ద్వారా సమస్త పాపాలు, విఘ్నాలు తొలగిపోతాయని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. గ్రహబాధలు ఉండవని, శత్రు, జంతు భయాలు ఉండవన్నారు. స్థానిక అలంకార మండపంలో ముందుగా అమ్మవారికి అలంకార పూజలు, అష్టవిధ మహామంగళ హారతులు ఇచ్చారు. వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దు చేసినట్లు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి చెప్పారు. పూజా కార్యక్రమంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్లు ఎం. నీలకంఠేశ్వరరాజు, పి.సుబ్బారెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నందవరంలో...

బనగానపల్లె రూరల్: దసరాశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు ఆదివారం కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. బనగానపల్లె పట్టణంలోని కొండపేట శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలోని శ్రీగాయత్రిదేవి అమ్మవారు శ్రీమహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.



మహాచండీగా మంచాలమ్మ



మంత్రాలయం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయ క్షేత్రంలో గ్రామ దేవత మంచాలమ్మ మహాచండీగా దర్శనమిచ్చారు. రజత కవచధారణలో పులిపై కొలువుదీరిన మంచాలమ్మ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ప్రత్యేక అలంకారంలో లక్ష్మమ్మవ్వ



ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడోరోజు ఆదివారం అమ్మవార్లు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేరుశనగ విత్తనాలు, రాజ్మా విత్తనాల అలంకారంలో ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వవారు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

లాఠీ.. దారి తప్పుతోంది!

- పలు నేరాల్లో వెలుగులోకి వస్తున్న పోలీసుల పాత్ర
- లోపాయికారికంగా మరుగున పడుతున్న ఘటనలు మరికొన్ని
- పోలీసు శాఖలో పెరుగుతున్న ఆగడాలు
- పట్టు తప్పుతున్న క్రమశిక్షణ
- వీఆర్‌కు పంపుతున్నా తీరు మార్చుకోని కొందరు ఖాకీలు
- జిల్లా పోలీసు శాఖను గాడిలో పెట్టాల్సిన సమయమిది

చేతిలో లాఠీ... నెత్తిన టోపీ... ఒంటి మీద ఖాకీ... వీటి పేరు చెబితే చాలు.. పోలీసు గుర్తొస్తాడు. నేరస్తులను పట్టుకుని బుద్ధి చెప్పడమే కాదు.. వారిని దారిలో పెట్టాల్సింది పోలీసే. అందుకు పోలీసులకు అధికారమే కాదు, బాధ్యత ఎక్కువగానే ఉంటుంది. ఇలాంటి పోలీసులే తప్పు చేస్తూ పోతే.. ప్రజలకు ఆ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోంది. లాఠీయే దారి తప్పిందని తెలిస్తే నేరస్తులకు కొమ్ములు వస్తాయి. దురదృష్టవశాత్తు జిల్లాలో కొందరు పోలీసులు క్రమశిక్షణ తప్పి శాఖ పరువు తీస్తున్నారు. ఇటీవల కాలంలో పదేపదే ఖాకీ కథలెన్నో వెలుగులోకి వస్తుండటంతో సామాజిక మాధ్యమాల్లోనే కాదు.. సామాన్య ప్రజానీకంలోనూ తీవ్ర చర్చనీయాంశమవుతోంది.



కర్నూలు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని పట్టుకుని చట్టం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే దారితప్పుతున్నారు. సంపాదన కోసం తమ పరిధిలను అతిక్రమించి జైలుపాలవుతున్న సంఘటనలు ఆ శాఖకు మచ్చగా మిగులుతున్నాయి. ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని బెదిరించి వసూళ్లకు పాల్పడిన ముఠా సభ్యులకు సహకరించి ఇటీవలే ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు సస్పెన్షన్‌కు గురయ్యారు. కరుడుగట్టిన నేరస్తుడు రౌడీషీటర్ శరీన్ నగర్‌కు చెందిన నాగేంద్ర అరాచకాలకు బ్లూ కోల్ట్స్ సిబ్బంది అండగా నిలిచి జైలుపాలయ్యారు. ఏకాంతంగా గడిపే జంటలపై దాడి చేసి నగలు, నగదు దోచుకోవడంతో పాటు యువతులపై గోర్లగుట్ట నాగేంద్ర అత్యాచారాలకు పాల్పడేవారు. నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద కొన్ని నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారం బ్లూ కోల్ట్స్ సిబ్బందికి తెలిసినప్పటికీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోనందుకు వారు శాఖాపరమైన చర్యలకు గురయ్యారు. అలాగే కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కృపానందం విజయవాడకు చెందిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జగదీష్‌తో చేతులు కలిపి ఇళ్ల దొంగతనాలకు పాల్పడి జైలుపాలు కావడం తాజాగా పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

క్రైం పార్టీ ముసుగులో...

పోలీసు శాఖ అంటే క్రమశిక్షణకు మారుపేరు. చట్టాలకు లోబడి పనిచేయాల్సిన కొందరు కాసుల రుచి మరిగి అక్రమార్కులకు సహకరించడం, అక్రమ వ్యవహారాల్లో తల దూర్చి శాఖాపరమైన చర్యలకు గురవుతున్నారు.

- క్రైం పార్టీ ముసుగులో కర్నూలు అర్బన్ తాలూకా, నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఏఎస్‌ఐ, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు కానిస్టేబుళ్లపై ఇటీవల బదిలీ వేటు పడింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేవారికి సహకరించారన్న నిఘా విభాగం నివేదిక మేరకు వారిని జిల్లా సరిహద్దు స్టేషన్లకు బదిలీ చేసినప్పటికీ రాజకీయంగా ఉన్నతాధికారులతో వారికున్న పలుకుబడిని ఉపయోగించి అనతి కాలంలోనే యథా స్థానాలకు వచ్చి దందాలు కొనసాగిస్తున్నారు.
- నగరంలో కొందరు పోలీసులకు గంజాయి స్మగ్లర్లతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలతో వెలుగు చూసినా చర్యలు లేకపోవడంతో ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
- విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా ఏఎస్‌ఐ పట్ల మద్యం మత్తులో పట్టపగలే దురుసుగా ప్రవర్తించిన హెడ్ కానిస్టేబుల్ బదిలీ వేటుకు గురయ్యారు. బాధితురాలు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఈ తతంగం వెలుగులోకి వచ్చి అప్పట్లో చర్చనీయాంశమైంది.
- కేసుల్లో సీజ్ చేసిన బైకులు పోలీస్‌స్టేషన్‌లో ఉంచుతారు. వాటికి అమ్మి సొమ్ము చేసుకుందామని కోడుమూరు పీఎస్‌లో పనిచేసే కానిస్టేబుల్ జగదీష్‌కు దుర్బుద్ధి పుట్టింది. పట్టుబడిన ఐదు బైకులను ఒక్కొక్కటిగా విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. అయితే ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లి ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యాడు.
- పాత కేసును తిరగదోడి ఓ చిరు వ్యాపారిని బెదిరించి ఓ సీఐ, కానిస్టేబుల్ ఇటీవల ఏసీబీకి పట్టుబడి జైలుపాలయ్యారు.
- పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు కొంతమంది ప్రైవేటు, చిట్‌ఫండ్స్‌తో పాటు ఫైనాన్స్ వడ్డీ వ్యాపారుల్లో భాగస్వాములుగా ఉంటున్నారు.
- కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో తెరచాటుగా దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చట్ట రీత్యా నేరం. ఇలా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి సహకరించడమే కాక మరి కొందరు దొంగలతో దోస్తీ కట్టి జైలుపాలు కావడం పోలీసు శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

స్టేషన్‌లోనే బేరసారాలు...

చట్ట పరిధిలోని వచ్చే చిక్కులు పరిష్కరించే దారిలో కొందరు ఖాకీలు కాసుల వేట సాగిస్తున్నారు. అన్యాయం జరిగిందని స్టేషన్ తలుపులు తట్టినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో దొరికినా క్రైం పార్టీ ముసుగులో అధికారుల పక్షాన కొన్ని స్టేషన్లలో కానిస్టేబుళ్లే బేరసారాలు కుదిరిస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఇతర వ్యవహారాలు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసేందుకు ప్రతి స్టేషన్‌కు ప్రత్యేక వ్యవస్థ ఉంది. కానీ ఆ నిఘా వ్యవస్థలోని కొందరు సిబ్బంది క్రైం పార్టీ సిబ్బందితో చేతులు కలిపి అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. బాధితులే నేరుగా ఫిర్యాదు చేస్తే తప్ప ఉన్నతాధికారులకు తెలియని పరిస్థితి ఇటీవల చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు రుజువు చేస్తున్నాయి. పోస్టింగ్ కేటాయింపుల్లో పట్టు కోల్పోతున్న ఉన్నతాధికారులు అవినీతికి పాల్పడుతున్న కిందిస్థాయి సిబ్బంది, అధికారులను నియంత్రించడంలోనూ పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నారనే చర్చ జరుగుతోంది. ఇటీవల పోలీసు శాఖలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పోస్టింగుల్లో సిఫార్సులకు పెద్దపీట వేస్తున్న ఉన్నతాధికారులు తర్వాత వారి పనితీరును పట్టించుకోకపోవడమే ఈ జాడ్యాన్ని అధికం చేస్తోందని పోలీసు శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు. వరుస సంఘటనల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు అవినీతి, అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి సారించి శాఖను చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న చర్చ జరుగుతోంది.

ప్రాణాలు కాపాడిన యువకులు


పత్తికొండ-హోసూరు రోడ్డులోని హంద్రీనీవాలో కొట్టుకుపోతున్న యువకుడు

పత్తికొండ రూరల్: పత్తికొండ -హోసూరు రోడ్డులోని హంద్రీ నీవా కాలువ నీటిలో ప్రమాదవశాత్తు పడి కొట్టుకో పోతున్న యువకుడిని అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ప్రాణాలకు తెగించి కాపాడారు. వివరాలు ఇలా.. హోసూరు గ్రామానికి చెందిన మాల కల్యాణ్ ఆదివారం ఉదయం హంద్రీనీవా కాలువ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో బస్సు రావడంతో భయపడి పక్కకు వెళ్లాడు. ఈ క్రమంలో అదుపుతప్పి కాలువలో పడిపోయాడు. అటువైపుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన జయకృష్ణ, హుసేన్ గమనించి వెంటనే నీటిలోకి దూకి కల్యాణ్‌ను ఒడ్డుకు తీసుకొచ్చారు. ప్రాణాలు తెగించి కాపాడటంతో ఆ యువకులను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న హంద్రీ


కర్నూలు నగరంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న హంద్రీనది

కల్లూరు: హంద్రీనది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు తోడు గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) నుంచి నీరు వదిలారు. దీంతో హంద్రీ నిండుగా ప్రవహిస్తూ జొహరాపురం వద్ద తుంగభద్ర నదిలో కలుస్తోంది. కాగా వరద నీటి ఉద్ధృతితో కల్లూరు దేవనగర్ మధ్యలోనున్న వంతెన నీటమునిగి రాకపోకలు నిలిచిపోయాయి. హంద్రీ పరిసరాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



ఆకాశంలో హరివిల్లు

వినీలా ఆకాశంలో సప్తవర్ణాల శోభితం ఆవిష్కృతమై కనువిందు చేసింది. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటూ కమ్ముకున్న మబ్బుల్లో నుంచి సూర్యకిరణాల ప్రసారంతో ఆకాశంలో అందాల హరివిల్లు ఏర్పడింది. చదువుల కోవెలకు హరివిల్లు హారంలా ఏర్పడి ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం రాయలసీమ యూనివర్సిటీ వద్ద ఆకాశంలో కనిపించిన ఇంద్రధనస్సును ప్రకృతి ప్రేమికులు కనులారా వీక్షించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

అరాచకాలకు మూల్యం తప్పదు

- ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి


డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆలూరు: అరాచకాలకు పాల్పడే అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. ఆలూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆలూరు మండల అధ్యక్షుడు కె.మల్లికార్జున ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ప్రతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందన్నారు. క్యూఆర్ కోడ్ ఐవీఆఎస్ కాల్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాష్ట్రంలో 'రెడ్‌బుక్'ను అమలు చేస్తూ ఇష్టానుసారం కేసులను పెట్టిన జైళ్లకు పంపుతున్నారన్నారు. ఈ సంస్కృతికి అడ్డుకట్టవేసేందుకే వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను తీసుకొచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంయుక్త కార్యదర్శి మహానంది, జిల్లా పీఆర్ వింగ్ ఉపాధ్యక్షులు ఓబులేసు, బీసీ సెల్ కార్యదర్శులు శ్రీనివాసులు, ఈరన్న, భాస్కర్, శేషప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున, గిరి, దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మాజీ మార్కెట్‌కమిటీ డైరెక్టర్ వెంకటేష్, సోమశేఖర్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

శనగ విత్తనాల పంపిణీ ఇంకెప్పుడు!

- కేటాయింపులో భారీ కోత
- ఈ సారి కేవలం 36,371 క్వింటాళ్లు మాత్రమే
- సబ్సిడీ విత్తనాల పంపిణీపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో 1.20 లక్షల హెక్టార్లలో శనగ సాగుకు అవకాశం
- అరకొర విత్తనాలతో రైతుల్లో ఆందోళన


ఏపీ సీడ్స్‌లో శనగ విత్తనాల ప్రాసెసింగ్ దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్ మరో రెండు రోజుల్లో మొదలు అవుతోంది. జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే ఇంతవరకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ ఊసే లేకుండా పోయింది. అటు నంద్యాల జిల్లాలో శనగ (బెంగాల్‌గ్రామ్) ప్రధాన పంట. శనగ విత్తనాల కోసం రైతులు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. రబీ సీజన్‌లో ఇటు కర్నూలు జిల్లాలో రబీలో 70 వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 50 వేల హెక్టార్ల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల హెక్టార్లలో సాగు అవుతుంది. రబీ సీజన్‌కు కూటమి ప్రభుత్వం సాగు విస్తీర్ణాన్ని, డిమాండ్‌ను, గత ఏడాది పంపిణీ చేసిన దానిని ఏ మాత్రం పట్టించుకోకుండా అరకొరగా శనగ విత్తనాలు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ తీరును పరిశీలిస్తే సబ్సిడీ విత్తనాల పంపిణీకి మంగళం పలికే ప్రమాదం ఉన్నట్లు స్పష్టమవుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాలు కేటాయించకపోవడంతో రైతుల ఆందోళన వ్యక్తం అవుతోంది. 2024–25 రబీ, 2025–26 ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేసిన విత్తనాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఏపీసీడ్స్‌కు సబ్సిడీ సొమ్ములో రూపాయి కూడా చెల్లించలేదు. రూ.120 కోట్లకు పైగా బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆర్గనైజర్లు ప్రస్తుత రబీ సీజన్‌కు శనగ విత్తనాల సరఫరాకు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది.

12,371 క్వింటాళ్ల కోత...

రబీలో శనగ సాగుకు కర్నూలు జిల్లాకు 46 వేలు, నంద్యాల జిల్లాకు 25 వేల క్వింటాళ్ల ప్రకారం ఉమ్మడి జిల్లాకు 71 వేల క్వింటాళ్లు శనగ విత్తనాలు అవసరమని మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు నివేదించారు. ఈ మేరకు కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యవసాయ యంత్రాంగం కూడా ప్రభుత్వానికి నివేదించింది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం తూతూమంత్రంగా కర్నూలు జిల్లాకు 23,897 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 12,564 క్వింటాళ్ల ప్రకారం 36,461 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. ఈ విత్తనాలు ఏ మాత్రం సరిపోవని వ్యవసాయ అధికారులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. గత రబీలో కర్నూలు జిల్లాలో 29,967 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాలో 18,865 వేల క్వింటాళ్ల ప్రకారం 48,832 క్వింటాళ్లు పంపిణీ అయ్యాయి. గత ఏడాది రబీతో పోలిస్తే కర్నూలు జిల్లాలో 6,070 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాలో 6,031 క్వింటాళ్ల శనగ విత్తనాలకు కూటమి ప్రభుత్వం కోత విధించింది. ఏకంగా ఉమ్మడి జిల్లాలో 12,371 క్వింటాళ్లకు కోత పెట్టడంతో ఈ సారి రబీల్లో శనగ విత్తనాలకు తీవ్ర కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నట్లు వ్యవసాయ అధికారులే పేర్కొంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ముందస్తుగానే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల సీజన్‌కు ముందే విత్తనాల పంపిణీ చేపట్టింది. రబీ సీజన్ అక్టోబరు 1 నుంచి మొదలవుతుంటే సెప్టెంబరు 20 నుంచే విత్తనాల పంపిణీ జరిగేది. ముందస్తుగా రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం వల్ల వర్షాలు పడినపుడు అదునులో విత్తుకోవడం జరిగేది. కూటమి ప్రభుత్వం గత ఏడాది రబీలో ఆలస్యంగా విత్తనాల పంపిణీ చేపట్టింది. ఈ సారి కూడా జాప్యం చేస్తుండటంతో రైతుల ఆందోళన అంతా.. ఇంతా కాదు. ఆలూరు సబ్ డివిజన్‌లో శనగ ముందస్తుగా సాగు చేస్తారు. ఇంతవరకు విత్తనాల పంపిణీ ఊసే లేకుండా పోవడంతో రైతులు ప్రయివేటుగా అధిక ధరలతో కొనుగోలు చేసే పరిస్థితి ఉత్పన్నం అవుతోంది. సాధారణంగా రబీలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయరు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022–23, 2023–24 సంవత్సరాల్లో రబీలో కూడా వేరుశనగ సబ్సిడీపై పంపిణీ చేసింది. ఈ సారి రబీ సీజన్‌కు కర్నూలు జిల్లాకు వేరుశనగ 4,715 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 449 క్వింటాళ్లు కేటాయించింది. గత ఏడాది రబీలో వేరుశనగ పంపిణీలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ సారి కూడా పంపిణీ చేయడం అనుమానం రైతుల్లో వ్యక్తమవుతోంది.